‘మట్టి’మేలు తలపెట్టవోయ్..

- చవితి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు
- వాడవాడలా సిద్ధమైన మండపాలు
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు
- మట్టి విగ్రహాల వైపే మొగ్గు చూపుతున్న ప్రజానీకం


రైతుబజార్‌లో పూజా సామగ్రి విక్రయాలు


బాజీ సెంటర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మట్టి విగ్రహాలు

విశాఖ విద్య: వినాయక చవితి వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఊరూ వాడా సిద్ధమైంది. సోమవారం వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఏడాదిలో వచ్చే తొలిపండుగ కావడంతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా వినాయక విగ్రహాలను పెట్టి శక్తి కొలదీ పూజలు చేసేందుకు ప్రజానీకం సిద్ధమయ్యారు. పూజాసామగ్రి కొనుగోలు దారులతో ఆదివారం ఎన్‌ఏడీ కూడలిలో మార్కెట్ సందడిగా కనిపించింది. బాజీ సెంటర్‌లో గణపతి విగ్రహాల విక్రయం జోరుగా సాగింది. ప్రత్యేకంగా మండపాలను తీర్చిదిద్దారు. 90 వార్డులోని కరాస, శాంతి నగర్‌లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రులు పూజల నిర్వహణకు ఉత్సవ కమిటీల వారు ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనందర్ కుమార్ సూచనల మేరకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నమ్మి శ్రీనుల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మార్కెట్‌లో కూడా మట్టి విగ్రహాల కొనుగోలు చేసేందుకే ప్రజానీకం ఆసక్తి చూపారు. సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగిన ముందస్తున్న ఏర్పాట్లు చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రామాలయం వద్ద ఆదివారం వినాయకుని మట్టి విగ్రహాలు, వినాయక పూజ కథ పుస్తకాలు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు భోగవల్లి నాగభూషణం మట్టి వినాయక ప్రతిమలు అందజేశారు.

మార్కెట్లకు చవితి సందడి

వినాయకుని ప్రతిమలు,పూజ సామగ్రి కొనుగోలు

మల్కాపురం: మార్కెట్‌లకు చవితి సందడి వచ్చింది. పండ్లు, పూలు కొనుగోలు చేసిన వారితో రద్దీగా మారాయి. పత్రిలు, పండ్ల ధరలు భారీగా పెరిగాయి. పూజ సామగ్రి కొనుగోలు చేసేందుకు జనం ఆదివారం బారులు తీరారు.మల్కాపురం ,శ్రీహరిపురం,గుల్లలపాలెం,జింక్ వద్ద గల మార్కెట్‌లు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా కనిపించాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వినాయకుని విగ్రహాలు తక్కువ ధరకు దొరుకుతుండడంతో భక్తులు ఆకర్షణీయమైన రూపాలను కొనుగోలు చేశారు. శ్రీహరిపురం భాష్యం పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కొంత మంది విద్యార్థులు వారే సొంతంగా మట్టి సేకరించి ఆ మట్టితో వినాయకుడి రూపాన్ని తయారు చేసుకుని ఆదివారం ఉదయం పూజలు చేశారు.

మట్టి గణపతుల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దయానందనగర్ చాకలిగెడ్డలో ఎటీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్ని కుమార్, మహిళా నాయకురాలు సర్వసిద్ధి సాయిలత, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


దయానందనగర్‌లో విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆనంద్‌కుమార్, సాయిలత


మార్కెట్లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు


వినాయక ప్రతిమలు,కథ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాగభూషణం

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


కాపు, తెలగ సంక్షేమ సంఘ సభ్యులను అభినందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, డీఏఆర్‌నగర్, సంతోష్‌నగర్‌కు చెందిన కాపు తెలగ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికైన సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

గోపాలపట్నం: గోపాలపట్నం గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజలు చేశారు. గ్రంథాలయాధికారి ఎన్వీ నరసింహం మాట్లాడుతూ సకల చరాచర సృష్టికి మూల కారకుడైన ఆది పురుషుడు విశ్వకర్మ అని కొనియాడారు.కార్యక్రమంలో పాఠకులు ఓంకార్, బాలాజీ, కుందన, తనూజ, శంకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లు కళకళ


కంచరపాలెం కూడలిలో వినియోగదారులు, వాహనాల రద్దీ

కంచరపాలెం: వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడాయి. కంచరపాలెం రైతుబజార్ వినియోగదారులతో నిండిపోయింది. వినాయ కచవితి పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. కంచరపాలెం కూడలి నేతాజీ ఫ్లైఓవర్ నుంచి ఊర్వశి జంక్షన్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వినియోగదారుల రద్దీ పెరగడంతో కంచరపాలెం కూడలిలో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

టీడీపీ నేతల నిరసన

గోపాలపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు ఇంటి వద్ద అరగుళ్లు కొట్టించుకుని కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పూజలు



కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు దూరం


డిజిటల్ స్క్రీన్ ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్కాపురం: వాహనదారులు తమ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉంటారని ట్రాఫిక్ సీఐ తులసీదాస్ అన్నారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మల్కాపురం, శ్రీహరిపురం తదితర ముఖ్య కూడళ్లలో డిజిటల్ స్క్రీన్ ద్వారా వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదని,సెల్‌ఫోన్ డ్రైవింగ్,త్రిపుల్ డ్రైవింగ్,మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమైనవి అని అన్నారు.ట్రాఫిక్ అధికారుల సూచనలను పాటిస్తు ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు.ప్రధాన సేవా మార్గాల్లో భారీ వాహనాలను నిలపడం నేరమన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


హోమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విశాఖ విద్య: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఆదివారం 52 వార్డు శివనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన పేరిట మహా మృత్యుంజయ హోమం జరిపించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, జిల్లా కార్యదర్శి మంజుల, వెస్ట్ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్, నాయుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 61వ వార్డు పార్టీ అధ్యక్షుడు పంచదార్ల అప్పలరాజుయాదవ్ ఆధ్వర్యంలో మల్కాపురం హనుమాన్ టెంపుల్‌లో పూజలు చేశారు. అనంతరం కార్మికులకు పండ్లు,బిస్కెట్‌లు పంపిణీ చేశారు. అలాగే విశకర్మ జయంతిని హెచ్‌పీసీఎల్ కార్మికులతో కలిసి నిర్వహించారు.

సింథియా: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో 62వ వార్డులోని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ నవ భారత నిర్మాణంలో ప్రధాని నరేంద్ర మోదీ సేవలు గొప్పవన్నారు. కార్యక్రమంలో ఎల్లబిల్లి వెంకటరావు, పంచదార్ల అప్పలరాజు, లతీష్‌రెడ్డి, ఆర్‌ఎస్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఆర్‌పీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి

సీఐ జి.డి.బాబు


ప్రజలకు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: మీ కోసం.. మీ సీఐ.. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పని చేస్తాను.. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు అంతా సహకరించాలని మల్కాపురం సీఐ జి.డి.బాబు విజ్ఞప్తి చేశారు. నేరాల నియంత్రణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆయన స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సిబ్బంది సాయంతో పంపిణీ చేయించారు. మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్ తదితర ప్రాంతాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అసాంఘిక కార్యకలపాలు జరిగినా,మద్యం,గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.అలాగే మద్యం,గంజాయి సేవించి ఎవరైనా ఇబ్బందులకు గురి చేసినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.స్టేషన్ పరిధిలో ప్రజలు సంతోషంగా ఉండాలని భావించే వారిలో తాను మొదటి వరుసలో ఉంటానని.. తన ఆలోచనకు అంతా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు వినాయకుడి మండపాల వద్దకు వెళ్లి అక్కడ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మద్యం సేవించి మండపాల వద్ద ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది గంగునాయుడు,సత్యనారాయణ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవోపీ వర్క్స్ కమిటీ ఎన్నికల్లో బీఎంఎస్ విజయం


వేడుకలు జరుపుకుంటున్న సభ్యులు

సింథియా: తూర్పు నావికాదళం పరిధిలోని మెటీరియల్ ఆర్గనైజేషన్(ఎంవోపీ) వర్క్స్ కమిటీ ఎన్నికల్లో బీఎంఎస్ అనుబంధ ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం(ఐఎన్‌సీయంయస్) ఘన విజయం సాధించింది. ఎంవోపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను ఐఎన్‌సీఎంఎస్ గెలుచుకుంది. అదే విధంగా ఐఎన్‌టీయూసీ అనుబంధ ఐఎన్‌సీఈ యూనియన్ 3 స్థానాల్లో, సీఐటీయూ అనుబంధ ఎన్‌సీయూ యూనియన్ ఒక్కస్థానంతో సరిపెట్టుకున్నాయి. క్యాంటీన్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఐఎన్‌సీఈ యూనియన్, ఎన్‌సీయూ యూనియన్ విజయం సాధించాయి. బీఎంఎస్ నుంచి వర్క్స్ కమిటీ సభ్యులుగా ఎ.సురేష్, వి.మోహన్‌కుమార్, పి.కృష్ణకుమార్, పూడి శ్రీనుబాబునాయుడు ఎన్నికయ్యారు. అదే విధంగా ఐఎన్‌సీఈ యూనియన్ తరపున ఆర్.శ్రీనివాస్, పీవీఎస్.అప్పారావు, బి.లప్పలరాజు, ఎన్‌సీఈ యూనియన్ నుంచి పి.క్రాంతికిరణ్ ఎన్నికయ్యారు. క్యాంటీన్ ఎన్నికల్లో ఐఎన్‌సీఈ యూనియన్‌కు చెందిన వై.రవికుమార్, ఎన్‌సీఈ యూనియన్‌కు చెందిన బి.రాజేష్ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి


మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

గోపాలపట్నం: వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహ మూర్తి సూచించారు. కంచరపాలెంలోని ఓ కల్యాణ మండపంతో పాటు మర్రిపాలెం ఉడాలేఅవుట్ లలితా డిల్లైట్‌లో వినాయక ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. పందిళ్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహం ఎత్తు బరువు, ఉత్సవాలు ఎన్ని రోజులు జరుపుతారు, నిమజ్జనం తేదీ, సమయం, వంటి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం సీఐఎన్ సాయి, ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, ఎస్ఐ రవి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకంగా నిలిచిన విద్యార్థులు


వ్యర్థాలు డంప్ చేసే ప్రదేశంలో రంగు రంగు ముగ్గులతో అవగాహన కల్పిస్తున్న చిన్నారులు

మల్కాపురం: ఆ విద్యార్థులు పలువురికి స్ఫూర్తి దాయకంగా నిలిచారు. పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేసి అభినందనలు అందుకున్నారు. 61వ వార్డు జనతాకాలనీలోని జైదుర్గాదేవి ఆలయం వెనుక చాలా మంది వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా మారుతోంది.ఈ సమస్యకు చెక్ పెట్టాలని భావించిన కొంత మంది పదో తరగతి విద్యార్థులు ఆదివారం రోడ్డుపై వ్యర్థాలను డంప్ చేస్తే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అప్పటికే ఉన్న వ్యర్థాలను తొలగించి అక్కడ రంగు రంగు ముగ్గులు వేశారు. మీకు ఎలాంటి వాతావరణం కావాలో తెలుసుకోండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు కుశ్మిత,భవాని,రోషన్,భాను,రక్షిత,జగదీష,వరుణ్,రూపేష్,ఆశ్రిత,తేజశ్వి,లక్ష్మీప్రసన్న,రజిని పాల్గొన్నారు.

మూలకు చేరిన బోరుబావి


ప్రకాష్‌నగర్‌లో పనిచేయని బోరు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో నీటి ఎద్దడితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగు నీటి బోరు పనిచేయడం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించి బోరుబావిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నప్రసాదం ఎలా ఉంది?

భక్తులను అడిగి తెలుసుకున్న ఈవో శ్రీనివాసమూర్తి


అన్నప్రసాద భవనంలో పరిశీలన చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాదం నాణ్యత ఎలా ఉందని స్వయంగా భక్తులనే దేవస్థానం కొత్త ఈవో శ్రీనివాసమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన దేవస్థానంలోని పలు విభాగాలను పరిశీలించారు. దీనిలో భాగంగా అన్నప్రసాద భవనంలోకి వెళ్లి అన్న ప్రసాదం తయారీ విధానాన్ని పరిశీలించారు. నాణ్యత ఎలా ఉందని స్వయంగా భక్తులనే అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా లైనులో నిలబడి అన్నప్రసాదం స్వీకరించారు. అన్నప్రసాదం తీసుకునే భక్తుల బయోమెట్రిక్ విధానాన్ని, సరుకులు నిల్వ చేసే స్టోర్స్ పరిశీలించారు. ఏఈవో రమణమూర్తి, అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఆయన వెంట ఉన్నారు.